ప్రజాశక్తి
సోమవారం 3 జూలై 2023
శ్రీకాకుళం



బస్‌స్టేషన్లలో లీజుకు ఖాళీ స్థలాలు


శ్రీకాకుళం : జిల్లాలో పలు బస్‌స్టేషన్లలో ఐదు ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజుకు ఇచ్చే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురంలో బిట్-1, 667 చదరపు గజాలు, బిట్-2, 7839 చదరపు గజాలు, సోంపేటలో 774 చదరపు గజాలు, టెక్కలిలో 17,908 చదరపు గజాలు, ఆమదాలవలస పాత బస్‌స్టేషన్‌లో 9,680 చదరపు గజాల ఖాళీ స్థలాలను లీజుకు ఇస్తున్నట్లు వివరించారు. బిడ్ సంబంధిత డాక్యుమెంట్లు ఈనెల ఐదో తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చని పేర్కొన్నారు. అర్హత కల్గిన బిడ్‌లు అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఇడి కార్యాలయం, జోనల్ వర్క్ షాప్, వి.టి అగ్రహారం, విజయనగరం వద్ద ఖరారు చేయబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు డిప్యూటీ ఇఇ శ్రీకాకుళం ఫోన్ నంబరు 93460 45369 సంప్రదించాలని సూచించారు.

జాడ లేని చినుకు

- జూలైలోనూ ఠారెత్తిస్తున్న ఎండలు
- ఉక్కపోతతో ప్రజల అవస్థలు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - పలాస

జూలై వచ్చినా భానుడి భగభగలు తగ్గడం లేదు. చినుకు జాడ కానరావడం లేదు. నైరుతి రుతుపవనాల రాకతో జూన్ నెలాఖరులో వాతావరణం చల్లబడినా, మళ్లీ నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఏటా జూన్ మూడో వారం వచ్చేసరికి వర్షాలు జిల్లాను పలకరించేవి. ఈ ఏడాది జిల్లాలో ఆ పరిస్థితి లేదు. మండు వేసవిని తలపించే ఎండలు జూలైలోనూ నమోదవుతున్నాయి. ఎక్కడా చిన్న చినుకు జాడ కూడా లేదు. జూన్‌లో 128.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 50.9 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో కురిసిన వర్షపాతం 63.7 మిల్లీమీటర్లు మాత్రమే. 28 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.



ఈ ఏడాది ఆలస్యంగా వచ్చిన నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి సమయం పట్టింది. పది రోజుల కిందట రుతుపవనాల్లో కదలిక వచ్చి రాష్ట్రమంతటా విస్తరించాయి. బంగాళాఖాతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తనం ఈ విస్తరణకు దోహదపడింది. దీంతో జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు కొంతమేర కురిశాయి. వరుణుడు కరుణించాడన్న సంతోషం ఎంతోకాలం లేదు. ప్రస్తుతం వరుణుడు ముఖం చాటేయడంతో జిల్లాలో చినుకు జాడ కరువైంది. ఎండలు ఠారెత్తిస్తున్నాయి. సాధారణంగా జూన్ మూడో వారానికే జిల్లాలో వర్షాలు కురిసేవి. ఈ సమయానికి జిల్లాలో చాలాచోట్ల రైతులు నారు పోసేవారు. వెదలు వేసేవారు. ఈ ఏడాది అందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. జూలై వచ్చినా వరుణుడు కరుణించకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో వరి సాగుకు సంకోచిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొంతవరకు ఇప్పటికే వెదలు వేశారు. విత్తనాలు చల్లినా వర్షం లేకపోవడంతో మొలకెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ 38 డిగ్రీల నుంచి 41 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం భానుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ముందే ఎండ తీక్షణంగా కాస్తోంది. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఉదయం 11 గంటల తర్వాత రోడ్లపై జన సంచారం తగ్గింది. ఎండ వేడి, వడగాలులకు జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచాన పడి ఉన్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



తిత్లీ తుపానులో నేలకొరిగిన కొబ్బరి చెట్లు (ఫైల్)

- పైసా పరిహారానికి నోచని 6,168 మంది రైతులు
- గరిష్ఠ పరిమితికి మించి ఉండడంతో నిలిపివేత
- ఐదెకరాలకు కుదించినా దక్కని సాయం
- ప్రతిపాదనలు పంపుతున్నా విడుదల కాని నిధులు

తిత్లీ పరిహారం ఎప్పుడో..?

తిత్లీ తుపాను సంభవించి ఐదేళ్లు కావస్తున్నా, ఉద్దానం ప్రాంతంలో నేటికీ వేలాది మంది రైతులకు పరిహారం దక్కలేదు. పరిహారం జాబితా రూపకల్పనలో చోటుచేసుకున్న తప్పిదంతో పైసా పరిహారం అందలేదు. నిబంధనల ప్రకారం పంట నష్టం ఐదెకరాలకు మించి ఉంటే, అటువంటి వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించదు. ఐదెకరాలకు కుదించి జాబితాలను తయారు చేయాల్సి ఉండగా, అధికారులు అప్పట్లో నిబంధనలను పక్కన పెట్టి జాబితాను రూపొందించారు. దీంతో అటువంటి వారందరికీ డబ్బులు రాలేదు. జాబితాను సవరించి అనేక పర్యాయాలు అధికారులు పంపుతున్నా, ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదు. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో చివరిసారిగా పంపారు. వీరికి పరిహారం సొమ్ముతో పాటు ప్రభుత్వం ప్రకటించిన అదనపు పరిహారం కూడా చెల్లించాల్సి ఉంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి


2018 అక్టోబరులో తిత్లీ తుపాను సృష్టించిన బీభత్సంతో వ్యవసాయ పంటలతో పాటు వేలాది ఎకరాల్లో కొబ్బరి, జీడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పటి టిడిపి ప్రభుత్వం కొబ్బరి చెట్టుకు రూ.1500 చొప్పున, జీడి పంటకు హెక్టారుకు రూ.30 వేలు చెల్లించింది. తుపాను ప్రభావంతో నష్టపోయిన 1,06,778 మంది రైతులకు రూ.239.74 కోట్లను పరిహారంగా చెల్లించింది. ఇందులో జీడిపంటకు సంబంధించి 51,314 మంది రైతులకు రూ.50.08 కోట్లను చెల్లించింది. 35,526 మంది కొబ్బరి రైతులకు రూ.189.66 కోట్లను చెల్లించింది. వీరు కాకుండా 6,168 మంది రైతులకు చెల్లించాల్సిన పరిహారం పెండింగ్‌లో ఉంది.

తుపానులో నష్టపోయిన రైతులతో పాటే వీరి వివరాలను పంపినా ఇప్పటివరకు డబ్బులు రాలేదు. జాబితా రూపకల్పనలో అధికార యంత్రాంగం చేసిన తప్పిదం వారికి శాపంగా మారింది. నిబంధనల ప్రకారం పంట నష్టం ఐదెకరాలకు మించి ఉంటే, ప్రభుత్వం పరిహారం చెల్లించదు. రైతులు ఐదెకరాలకు మించి నష్టపోయినా, దాన్ని ఐదెకరాల్లోపు కుదించి పంపించాల్సి ఉంటుంది. అలా చేయకపోవడంతో వారందరికీ పైసా పరిహారం దక్కలేదు. పంట నష్టాన్ని ఐదెకరాల్లోపు కుదించి తిరిగి పంపాలన్న ప్రభుత్వ సూచనలకనుగుణంగా అధికారులు పలుమార్లు నివేదికలు పంపినా ఫలితం కనిపించడం లేదు.

రూ.26.84 కోట్లు పెండింగ్

జాబితా రూపకల్పనలో జరిగిన పొరపాటుతో జీడి, కొబ్బరి రైతులకు మొత్తం రూ.26.84 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో 2,764.81 ఎకరాల జీడి పంటకు రూ.3.36 కోట్లు, 4,265.91 ఎకరాల కొబ్బరి పంటకు రూ.23.48 కోట్లు ఇవ్వాలి. దీంతోపాటు వీరికి ప్రభుత్వం ప్రకటించిన అదనపు పరిహారం డబ్బులూ రావాల్సి ఉంది. కొబ్బరి చెట్టుకు అదనంగా రూ.1500, జీడి పంటకు అదనంగా మరో రూ.20వేలు పరిహారం ప్రకటిస్తూ విడుదల చేసిన జిఒ మేరకు అర్హులైన వారికి ఇప్పటికే చెల్లింపులు పూర్తి చేసింది.

ఐదెకరాలు దాటిందని ఇవ్వలేదు



నాకు 12 ఎకరాల కొబ్బరి తోట ఉంది. తుపానుకు 324 చెట్లు నేలకూలాయి. ఐదెకరాలకు పైగా భూమి ఉందని కేవలం రూ.50 వేలు పరిహారం మాత్రమే అందించారు. మిగిలిన డబ్బులు ఇవ్వలేదు. పరిహారం డబ్బులు వస్తే, నూతన వంగడాలు కొని వేయాలనుకున్నాను.

- బెందాళం నరసింహమూర్తి, రైతు, కవిటి

ఇదిగో అదిగో అంటున్నారు



తిత్లీ పరిహారం ఇస్తామని ఏళ్లు గడిచిపోయాయి. ఇదిగో అదిగో అంటున్నారు. నాకున్న పదెకరాల్లో రెండు ఎకరాలకు రూ.36 వేల నష్టపరిహారం వచ్చింది. మిగతా ఎనిమిది ఎకరాల్లో 130 కొబ్బరి చెట్లు నష్టపోయాను. పంట విస్తీర్ణం ఐదు ఎకరాలు మించి ఉందని ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. పరిహారం డబ్బులు వస్తే మేలు రకం కొబ్బరి చెట్లను నాటాలనుకున్నాను.

- బెందాళం చక్రధరరావు, రైతు, కవిటి

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్రం

ప్రముఖ నటుడు ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - కంచిలి

రాజ్యాంగ స్ఫూర్తిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దెబ్బ తీస్తోందని ప్రముఖ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి విమర్శించారు. మండలంలోని బూరగాంలో జై భీమ్ చైతన్య సేవా సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తోందన్నారు. రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. అటువంటి చర్యలను పోరాటాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయసాధనకు యువతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా కవి జయరాజ్, పి.ఎస్.ఎన్ మూర్తి, రుంకు అప్పారావు, మిస్కా కృష్ణయ్య, సర్పంచ్ బొడ్డు రాజేశ్వరి, జై భీమ్ చైతన్య సేవా సంఘం సభ్యులు కె.రాజు, ఎన్.మోహనరావు, కె.గోపీనాథ్, వి.తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి

'ఎర్రన్న విద్యా సంకల్పం'కు విశేష స్పందన

4,586 మంది అభ్యర్థులు హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆదివారం నిర్వహించిన గ్రూప్-1, 2 యుపిఎస్‌సి, ఎపిపిఎస్‌సి, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసింది. శ్రీకాకుళంలోని గురజాడ కళాశాల, ఎస్ఆర్ కళాశాల, శివానీ, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, టెక్కలిలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, పలాసలో శ్రీ గురుకుల పాఠశాల, శ్రీ గురుకుల జూనియర్ కాలేజ్, విద్యా వాహిని కళాశాల, మదర్ థెరిసా పాఠశాలల్లో పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 4,586 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పలు పరీక్షా కేంద్రాలను ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిశీలించారు.

రెండు మూడు రోజుల్లో ఫలితాలను విడుదల చేస్తామన్నారు. విద్యారంగంలో జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలన్న తన తండ్రి ఎర్రన్నాయుడు ఆశయసాధన కోసం తాను ఈ కార్యక్రమం ప్రారంభించానని చెప్పారు. నాలుగేళ్లుగా ఎంతోమంది నిరుద్యోగులు పరీక్షల కోసం ఎదురుచూస్తూ మారిన సిలబస్‌కు అనుగుణంగా పుస్తకాలను కొనలేకపోతున్నారని గుర్తించి, అటువంటి నిరుద్యోగ యువతకు సాయం అందించేలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. పరీక్షకు విశేష స్పందన లభించిందన్నారు. మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.పది వేల స్కాలర్‌షిప్ అందించడంతో పాటు మొదటి వంద స్థానాలు సాధించిన యువతకు ఉచితంగా పుస్తకాల సెట్‌ను అందించనున్నామని తెలిపారు. పరీక్షా కేంద్రాల నిర్వహణకు తోడ్పాటు అందించిన యాజమాన్యానికి, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

కిడ్నీ సమస్యపై లక్ష సంతకాల సేకరణ

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఉద్దాన ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ సమస్య పరిష్కారానికి ఈనెల ఐదో తేదీన సోంపేటలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో లక్ష సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఐదో తేదీ నుంచి గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి లక్ష సంతకాలను సేకరించి, కిడ్నీ సమస్య తీవ్రతను తెలిపే సంతకాల ప్రతిని కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో మూడు నెలలకోసారి అందరికీ కిడ్నీ పరీక్షలు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. నియోజకవర్గంలోని కమ్యూనిటీ ఆస్పత్రుల్లో నెఫ్రాలజిస్టును నియమించి, కిడ్నీ సంబంధిత నిర్ధారణ పరీక్షలన్నీ ఇక్కడే చేయించాలని డిమాండ్ చేశారు.

కిడ్నీ వ్యాధి ప్రారంభ దశ నుంచి రోగి వైద్యం పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న రక్త అవసరాల దృష్ట్యా నియోజకవర్గంలో అధునాతన పరికరాలతో బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేయాలని కోరారు. క్రియాటినిన్ 5 పాయింట్లు దాటిన రోగులకు రూ.ఐదు వేల పెన్షన్ చెల్లించాలని, నాణ్యమైన మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కిడ్నీ వ్యాధి శాశ్వత పరిష్కారానికి అవసరమైన రీసెర్చ్ సెంటర్ ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్దానం ఊపిరి కోసం చేపట్టబోయే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, మండల అధ్యక్షులు డి.నీలవేణి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

జిపిఎస్ పేరుతో మోసం

- ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి
- 8న కలెక్టరేట్ వద్ద ధర్నా
- సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు జిపిఎస్ పేరుతో ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్వరరావు విమర్శించారు. ఉద్యోగుల భవిష్యత్‌కు భరోసా లేని జిపిఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల ఎనిమిదో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో ధర్నా సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రాష్ట్రాలు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తున్నాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోగా, జిపిఎస్ విధానాన్ని తీసుకొస్తామని చెప్తోందన్నారు. దీనివల్ల ఉద్యోగులకు ఒరిగేది శూన్యమన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని పోరాడుతున్న ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం క్రిమినల్ కేసులతో భయపెడుతోందన్నారు. కేసులకు భయపడేది లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఒపిఎస్‌ను సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొందూరు అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, సిపిఎస్ కన్వీనర్ నారాయణరావు, ఎపిటిఎఫ్(257) నాయకులు నవీన్, రామ్మోహనరావు, ఎపిటిఎఫ్(1938) నాయకులు టి.చలపతిరావు, పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి దానేటి కేశవ, ఎస్‌జిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనుంజయరావు, ఎపి సిపిఎస్ఇఎ నాయకులు చల్లా దుర్గాప్రసాద్‌తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగిస్తే రాజకీయం చేస్తారా...?

మున్సిపల్ ఛైర్మన్ బి.గిరిబాబు

పలాస : సాగునీటి కాలువపై ఆక్రమణలను తొలగించడాన్ని టిడిపి నాయకులు రాజకీయం చేస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నబాడాంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సాగునీరందక ఏటా ఇబ్బందులు పడుతున్నామని వంశధార అధికారుల దృష్టికి రైతులు తీసుకొచ్చారని చెప్పారు. అందులో భాగంగానే కాలువలో పూడికలు తీశారని, కాలువపై చేపట్టిన నిర్మాణాన్ని తొలగించారని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ రాజకీయం చేసి ప్రాంతాలు, ప్రజల మధ్య గొడవలు పెట్టే రీతిలో గౌతు శిరీష మాట్లాడడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఒక మహిళ మంత్రిపై మాట్లాడే తీరును చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు.

టిడిపి నాయకులు నాగరాజు కాలువను ఆక్రమించుకుని రహదారి నిర్మించుకుంటే పంట పొలాలకు నీరు ఎలా వెళ్తుందో చెప్పాలని ప్రశ్నించారు. వాస్తవాలు గమనించలేని స్థితిలో ప్రతిపక్ష నాయకులు ఉన్నారని విమర్శించారు. ఇతర నియోజకవర్గాల నుంచి నాయకులను రప్పించి పలాసలో అల్లర్లు సృష్టించాలని చూస్తే తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. శిరీషకు అధికార దాహం తప్ప రైతుల కష్టాలు ఏం తెలుసునన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు, వార్డు కౌన్సిలర్ ప్రతినిధి దువ్వాడ రమణయ్య, బి.బల్లయ్య, ఎ.ఆనందరావు, బి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు తొలగింపు

- గౌతు శిరీష హౌస్ అరెస్టు
- టిడిపి నాయకుల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నబాడాంలో టిడిపి నాయకుడు నాగరాజు ఇంటికి వెళ్లేందుకు సాగునీటి కాలువపై వేసిన కల్వర్టును అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య శనివారం అర్ధరాత్రి తొలగించారు. ఆందోళన చేస్తున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, ఎమ్మెల్యే అశోక్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీషతో పాటు 60 మందిని అరెస్టు చేసి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టుల సమయంలో టిడిపి నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఒక్కసారిగా పోలీసులు అందరినీ తోసివేయడంతో టిడిపి కార్యకర్త సంపతిరావు ట్రాక్టరుపై పడిపోవడంతో ఛాతి, తలపై గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం గౌతు శిరీషను సోంపేటలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సోంపేటలో హౌస్ అరెస్టు అయిన గౌతు శిరీషను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షాలపై పోలీసులు ఎలా దాడులు చేయించాలో కొత్త సంస్కృతిని మంత్రి సీదిరి అప్పలరాజు నేర్పిస్తున్నారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఇదే పోలీసులు అప్పలరాజును ఈడ్చుకుంటూ వెళ్తారన్నారు. ఆయన తట్టా బుట్టా సర్దుకుని పలాస ఖాళీ చేసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కూల్చిన కల్వర్టు

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నీలంశెట్టి లక్ష్మి అన్నారు. నగరంలోని ఒక సంక్షేమ భవనంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ ఖ్యాతి శ్రీకాకుళం జిల్లాకు ఉందని గుర్తు చేశారు. వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మరింత సత్తా చాటుతారని చెప్పారు. ఒలింపిక్ పతకాల సాధనే లక్ష్యంగా క్రీడాకారులు శ్రమించాలన్నారు. క్రీడాకారులకు సౌకర్యాల కల్పనకు, సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు.

అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దేన్నాబాబు మాట్లాడుతూ జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇంజరాపు భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వర్ధమాన క్రీడాకారులను తయారు చేస్తున్నామని, వారికి తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం వెయిట్ లిఫ్టింగ్‌లో విశేష సేవలందించిన అమ్మినాయుడు, విశ్వనాథం, ఇంజరాపు భాస్కరరావును సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నాయకులు బి.వెంకటరమణ, జిల్లా కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆమదాలవలస మండలంలోని తిమ్మాపురానికి చెందిన బొడ్డేపల్లి వెంకునాయుడు రూ.1,01,111 విరాళంగా అందజేశారు. కుటుంబసభ్యులతో కలిసి అరసవల్లి ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ సహాయకులు కృష్ణమాచార్యులకు విరాళం చెక్కును అందజేశారు. తన భార్య బొడ్డేపల్లి తులసమ్మ జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.

రూ.4.57 లక్షల ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం రద్దీ పెరిగింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,16,800, విరాళాల రూపంలో రూ.69,069, ప్రసాద విక్రయాల ద్వారా రూ.1,71,000 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. నగరంలోని గుజరాతీపేట ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, సింహ సుధాకర్, సురకాశి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

టెక్కలి రూరల్ : టెక్కలి మండల పరిధిలో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపిడిఒ హెచ్.వి రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి గ్రామ సచివాలయం-1లో 3, మేఘవరంలో 2, బన్నువాడ, గూడెం, తెలినీలాపురం సచివాలయాల్లో ఒక్కొటి ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల మూడో తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం : రణస్థలం మండల కేంద్రంలో ఉన్న బాలాజీ డిపార్ట్ మెంటల్ స్టోర్స్ ప్రొప్రయిటర్ కింతలి జగదీశ్వరరావు, సతీష్ తండ్రి దామోదరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో రణస్థలం మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ బేతి బ్రహ్మజీ, వైసిపి నాయకులు పిన్నింటి సత్యంనాయుడు, మంత్రి శ్రీను, నారాయణశెట్టి ప్రభ తదితరులున్నారు.

200 మందికి వైద్యం



ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని తురకపేటలో సన్రైజ్ హాస్పిటల్ అధినేత ప్రముఖ వైద్యులు, సంఘ సేవకులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎండలో ఎక్కువగా తిరగవద్దని సూచించారు. అధిక మొత్తంలో మంచినీరు, కొబ్బరి నీళ్ళు, పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుండి రక్షణ పొందవచ్చునన్నారు.. మలేరియా, కలరా వంటి వ్యాధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెగా వైద్య శిబిరంలో 200 మందికి ఉచితం పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అలాగే మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి దమయంతి, ఢిల్లీ శ్వరరావు, సన్రైజ్ హాస్పిటల్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి కుట్ర కేసుకు వ్యతిరేకంగా పోరాడుదాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - పలాస

తాడ్వాయి కుట్ర కేసుకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ అధ్యక్షతన ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ సంధ్య మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడుతూ, మహిళల హక్కులు సాధించడంలో తన గొంతును నినదిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆమె ముందు వరుసలో ఉన్నారని గుర్తుచేశారు. మావోయిస్టు అనుబంధ సంఘాలతో ఆమెకు సంబంధాలున్నాయని, ప్రశ్నించే గొంతుకను అణచివేసేందుకే కుట్ర కేసు పెట్టారని దుయ్యబట్టారు. నల్ల చట్టాలు బ్రిటిష్ కాలం నుండి నేటి వరకు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పౌర హక్కుల నాయకులు పత్తిరి దానేష్, పి.అరుణ, మద్దిల.మల్లేశ్వరరావు, పుచ్చ.దుర్యోధన, జోగి.కోదండరావు, గొరకల బాలకృష్ణ, సాలిన.వీరస్వామి, సన్యాసిరావు, నాగమణి, తామాడ.త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుసుమ



ఆర్థికసాయం అందిస్తున్న దేవరాజ్ సాహు

సొంత లాభం కొంత మానుకుని...

కవిటి : సొంత లాభం కొంత మానుకొని పొరుగు వానికి సాయపడవోయి అన్న గురజాడ సూక్తికి నిలువెత్తు నిదర్శనం వలస కార్మికులు అని పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజు సాహు అన్నారు. ఇటీవల మరణించిన కవిటి మండలం మాణిక్యపురానికి చెందిన గోపిచంద్ర సాహు కుటుంబానికి తనతోపాటు పనిచేస్తున్న తోటి కార్మికులు అండగా నిలిచారు. టర్కీలో ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్న గోపిచంద్ర సాహు అనారోగ్యానికి గురికావడంతో స్వగ్రామానికి చేరుకుని రాగోలు జేమ్స్ లో చికిత్స పొందుతూ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు ఆదివారం సాయంత్రం పిఎసిఎస్ అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి దేవరాజు సాహు చేతులు మీదుగా ఆ కుటుంబానికి రూ.8 లక్షలు అందించారు. ఈ సందర్భంగా దేవరాజ్ సాహు మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటి కార్మికుని కుటుంబం కోసం ఆర్థికసాయం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, ఢిల్లీ మజ్జి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

నందిగాం : మండలంలోని దేవుపురం పంచాయతీ కొండతెంబూరుకి చెందిన కుదుమ శ్రీనివాసరావు, అన్నపూర్ణ కుమార్తె రాజేశ్వరి సెరిబ్రల్ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల ముఖ్య మంత్రిని, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ద్వారా కలసి తమ సమస్యను ఆ కుటుంబం విన్నవించుకుంది. ఆయన స్పందించి, రూ.5లక్షలు తక్షణ సహాయం కింద సి.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా చెక్‌ను ఇటీవల అందించారు. బాధితురాలికి మంజూరైన పింఛన్ రూ.5 వేలు చెక్కును మాజీ ఎంపిపి వై.చక్రవర్తి ఆ కుటుంబానికి అందించారు. వాలంటీర్ కె.లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు



ఆర్థికసాయం అందిస్తున్న చక్రవర్తి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న గిరిబాబు

రోడ్డుపై చెత్త కనిపించకూడదు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ పరిధిలో రోడ్లపై చెత్తాచెదారం కనిపించకూడదని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారులను ఆదేశించారు. ఎప్పటి చెత్త అప్పుడే తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్యంపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, కౌన్సిలర్ బోర చంద్రకళ, పారిశుధ్య, సచివాలయ ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు సన్నాహాలు

ప్రజాశక్తి - రణస్థలం

ఈనెల 13న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కిరణ్ యువసేన సభ్యులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కిరణ్ యువసేన సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మదిన వేడుకల్లో భాగంగా సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల నాలుగో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా టీమ్‌లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ నుంచి ఒక టీమ్‌ను తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.12,500 అందజేయనున్నట్లు చెప్పారు. విజేతలకు 13న ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదు

ప్రజాశక్తి - కవిటి

చదువుకు పేదరికం ఆటంకం కాకూడదని అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు అన్నారు. జెఇఇ అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించి, ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్న కొత్తపాలెంకు చెందిన గంటా కోదండరావుకు కలాం ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఆదివారం గ్రామానికి చేరుకున్న సభ్యులు కోదండరావుకు రూ.13 వేలు అందించారు.

అనంతరం వీరు మాట్లాడుతూ పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదని, భవిష్యత్‌లోనూ కోదండరావుకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వరరావు, ఎం.రవి, జి.జానకిరావు, ఎన్.సోమేశ్వరరావు, పి.శంకర్, ఎన్.బాలకృష్ణ, భగవాన్ బెహరా, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - లావేరు

ప్రతి విద్యార్థి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయములో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. జాతీయ నాయకులు, ప్రముఖ స్వాతంత్ర నాయకుల జీవిత చరిత్రలు, బాలసాహిత్యం, చిన్నారులు కథలు అందుబాటులో ఉంటాయని, వాటని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం : పుస్తక పఠనం మంచి అలవాటని, పుస్తకాలు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని గ్రంథాలయ అధికారి పి.వరలక్ష్మి అన్నారు. ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహణలో భాగంగా దేశ నాయకుల జీవిత చరిత్రలు, కథలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధిపథంలో ముందుకు సాగడానికి పుస్తక పఠనం దోహదపడుతుందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వాళ్ల జీవితాలు చేతలారా వాళ్లే నాశనం చేసుకున్న వాళ్లవుతారని, ఇలాంటి విషయాలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.



లావేరు : పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

తాగునీటి ఎద్దడిని నివారిస్తాం

ప్రజాశక్తి - పలాస

గిరిజన గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా, కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసి నీటి ఎద్దడి నివారిస్తామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని పెంటిభద్ర గ్రామంలో రూ. 4.90 లక్షల వ్యయంతో తాగునీటి సరఫరా పైపులైన్, రూ.2 లక్షల వ్యయంతో పద్మనాభపురం కోనేరు రక్షణ గోడ నిర్మించేందుకు ఆదివారం మున్సిపల్ చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి, సిసి రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా కోట్లాది రూపాయలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలాస ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దట్టీర్.భవానీశంకర్, వైస్ చైర్మన్ నవర.సోమేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ-1 గా రామరాజు



ఎంఇఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు : పొందూరు మండల విద్యాశాఖ అధికారి-1గా పి.వి రామరాజు నియమితులయ్యారు. ఇంతకుముందు ఎంఇఒగా పొందూరులో పనిచేసిన రామరాజు హెచ్.ఎంగా జలుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఎంఇఒ-1గా పొందూరు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎంను నియమించారు. ఇటీవల కౌన్సిలింగ్‌లో భాగంగా పొందూరు ఎంఇఒ-1గా రామరాజును తిరిగి నియమించారు. రామరాజు ఆదివారం విధుల్లో చేరారు.

జీడి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

పలాస : మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన జీడి రైతు పత్తిరి గురయ్య రెండు రోజుల క్రితం మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురయ్య జీడి తోటల వెళ్ళి మృతి చెందారని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జీడికి మద్దతు ధర లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చూడాలని ప్రభుత్వానికి కోరారు. ఆయనతో పాటు ఎం.రామారావు, తెప్పల.రాజు, బుడత బాలరాజు, తెప్పల.భీమారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థికి వేదం ఫౌండేషన్ చేయూత



నగదును అందజేస్తున్న వేదం ఫౌండేషన్ సభ్యులు

సోంపేట : ఇటీవల ట్రిపుల్ ఐటికి ఎంపికైన గంట కోదండరావుకు స్థానిక వేదం ఫౌండేషన్ సభ్యులు ఆదివారం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మేరకు వాడలలిల చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బి.కామేశ్వరరావు, సభ్యుల కర్రి తాతారావు, వేదం ఫౌండేషన్ అధ్యక్షులు జోగారావుల విద్యార్థి స్వగ్రామం కొత్తపాలెం వెళ్లి విద్యార్థికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతున్న నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లేశ్వర రావు, చంద్రశేఖరం, గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఔదార్యం

టెక్కలి : మండలంలోని నరసింగపల్లి పంచాయితీ సర్పంచ్ రౌతు జయ మోహన్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన సాహుకారు మోహన్‌రావు కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నది. ఆ కుటుంబానికి ఆర్థిక సహకారం అందించాలన్న ఉద్దేశంతో సర్పంచ్ జయ మోహన్ పిలుపుమేరకు గ్రామస్తులు రూ.63,655లు సేకరించి, సహకారాన్ని ఆదివారం మోహన్‌రావుకు అందజేశారు. అదే గ్రామానికి చెందిన రాంబాబు చారిటబుల్ ట్రస్ట్ నుంచి పదివేల రూపాయలు సహకారాన్ని అందించారు. తన పిలుపుమేరకు మూడు రోజుల కాలవ్యవధిలో సహకారాన్ని అందించిన వారికి సర్పంచ్ జయ మోహన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శాంతారావు, ఎన్ని షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

'జనసేనతోనే ప్రజా సంక్షేమం'



పోస్టర్లను పంపిణీ చేస్తున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

ప్రజలందరి భవిష్యత్తు బాగుండాలంటే జనసేన పార్టీ అధికారంలోకి రావాలని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పేడాడ రామ్మోహన్‌రావు అన్నారు. ఆదివారం సరుబుజ్జిలి మండలం లోని మూలసవళాపురం పంచాయతీ పరిధిలోని తురక పేటలో జనసేన సీనియర్ నాయకులు పాత్రుని పాపారావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో జనంలోకి జనసేన కార్యక్రమంతో ఇంటింటికి వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను, ప్రజలకు ఎలా అండగా నిలబడుతుంది తదితర విషయాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పేడాడ రామ్మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు మామ, అల్లుళ్ల పాలనను చూశారని, రాష్ట్రంలో వైసిపి, టిడిపి పరిపాలనను పత్యక్షంగా చూశారని, ఒక్క అవకాశం జనసేనకు ఇవ్వాలని యువతను కోరారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. అనంతరం జనసేన నాయకులు రిటైర్డ్ ఆర్ఐఒ పాత్రుని పాపారావు మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్న పవన్ కళ్యాణ్ ను ప్రజలు ఆదరించాలని కోరారు. కౌలు రైతుల కష్టాలను చూసి చలించి వారికి ఆర్థిక తోడ్పాటును అందించిన ఘనత పవన్ కళ్యాణ్ కే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్, యాలకుల.రమణ, గదిలి రాజలింగం, రమణబాబు, పేడాడ రమణ,గొల్లపల్లి శ్రీధర్, సంఘంశెట్టి తేజేశ్వరరావు, బి ఎ నాయుడు, జనపల సతీష్, దాసరి సురేష్, మీసాల పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి-వజ్రపుకొత్తూరు



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్‌ను లబ్ధిదారులకు ఎలాగైనా అందించి, వారికి సహాయ పడాలనే తపనతో సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి, గ్రామ వాలంటీర్ కమల సంకల్పించారు. అనుకున్నదే తడవుగా ఆదివారం విశాఖపట్నంలో వెళ్లి, ఓమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి అందజేశారు. గోవిందపురం పంచాయతీ సీతంపేటకి చెందిన హనుమంతు నాగేశ్వరరావు గత కొన్ని రోజులుగా అనారోగ్య కారణంగా విశాఖపట్నంలోని పొందుతున్నారు. ఈ సందర్భంగా రోగి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ అందించడానికి వాలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని, పేద ప్రజలకు పెన్షన్ సొమ్ము ఎంతో అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఆయనతోపాటు గ్రామ పెద్దలు మెట్ట వెంకట్రావు, మెట్ట శ్రీను ఉన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా హేమాచలం


ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా రోణంకి హేమాచలంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలాస లయన్స్ క్లబ్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. కార్యదర్శిగా టి.మాధవరావు, కోశాధికారిగా ఎన్.అప్పారావును ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సత్కరించారు.

భర్త వేధింపులకు మెడికో ఆత్మహత్య!

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని 20 వార్డు శివాజీనగర్‌కు చెందిన వైద్య విద్యార్థి పాలవలస చైతన్య నెల్లూరులోని ఒక వైద్య కళాశాలలో శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. చైతన్యకు నందిగాం మండలం విశ్వనాథపురానికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు బమ్మిడి శరత్‌చంద్రతో ఈ ఏడాది మార్చి 8వ తేదీన వివాహమైంది. చైతన్య తల్లి పాలవలస జ్యోతి స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నారు. కుమార్తె మరణవార్త తెలియగానే కుటుంబీకులు కర్నూలు ఆదివారం వెళ్లారు. చైతన్య బలవన్మరణంతో శివాజీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.



భర్తతో చైతన్య (ఫైల్ ఫొటో)

'ప్రజా పాటల పందిరి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పొందూరు

పొందూరు మండలం తాడివలసలో ప్రముఖ ప్రజా గాయకుడు, ప్రజానాట్య మండలి కళాకారులు పందిరి రాము ప్రచురించిన 'ప్రజా పాటల పందిరి' పుస్తకా విష్కరణ కార్య క్రమం నిర్వహించారు. సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, రిటైర్డ్ లెక్చరర్ మెట్ట అన్నాజీభట్లు, రిటైర్డ్ ఆర్ఐఒ ఎం.ఎ.ఎన్ భట్లు చేతుల మీదుగా ప్రజా పాటల పందిరి పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తమ్మినైన మణెమ్మ మాట్లాడుతూ తాడివలస గ్రామానికి చెందిన పందిరి రాము పెద్దగా చదువుకోకపోయినప్పటికీ సుమారు 300 పాటలను అనర్గళంగా పాడడం చాలా గొప్ప విషయం అని అన్నారు. సమాజాన్ని మేల్కొల్పే పాటలను పాడుతూ చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ఆయనకు గ్రామ పెద్దలు పౌరసన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు రామానుజాచార్యులు, ఉపాధ్యాయులు తమ్మినైన నీలంన్నాయుడు, తమ్మినైన విభీషణరావు, మాజీ సర్పంచ్ తమ్మినైన లక్ష్మణరావు, సాహితీ ప్రియులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తదితరులు



కృష్ణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

లయన్స్ క్లబ్ భవనానికి స్థలం

ప్రజాశక్తి - నరసన్నపేట

నరసన్నపేట మిలీనియం లయన్స్ క్లబ్ భవనానికి టెక్కలిపాడు లే అవుట్ వద్ద తన పది సెంట్ల స్థలాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ విరాళంగా ప్రకటించారు. లయన్స్ క్లబ్ నరసన్నపేట అధ్యక్షులుగా సదాశివుని కృష్ణ, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు సమాజానికి మరింత చేరువయ్యేలా చూడాలన్నారు. అనంతరం డాక్టర్స్ డే సందర్భంగా 28 మంది వైద్యుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు బోయిన బాలకృష్ణ, కార్యదర్శి ఎస్.ఎస్.ఎస్ శర్మ, వి.నాగరాజు, కోశాధికారి పొట్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్ఛాపురం : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంచార జాతుల్లో ఇంకా నవరత్నాలు అందని వారి కోసం తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు హామీ ఇచ్చారు. ఆదివారం గుంటూరు అరండల్ పేటలో జరిగిన రాష్ట్ర సంచార, అర్ధ సంచారా, విముక్త జాతుల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సంచారజాతుల్లో నవరత్నాలు అందని వారుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కుప్పం నుండి ఇచ్ఛాపురం వరకు సుమారు 40 లక్షల మంది వీరు ఉన్నారని, వారి సమస్యలను ముఖ్యమంత్రి సహకారముతో పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజ్యాధికారం దిశగా డి ఎన్.టి కులానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎం.పి. గా ఉన్న నాడే అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర జె.ఎ.సి అధ్యక్షులు డెవల్లా మల్లికార్జున రావు అన్నారు. రాబోయే విధాన సభ ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రెడ్డిక సామాజిక వర్గానికి ఎమ్మెల్యే గా అవకాశము కల్పించాలని తీర్మాణం చేశామన్నారు. ఈ సమావేశం లో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకేశ్వరరావు

టిడిపితోనే సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

టిడిపితోనే సంక్షేమ పాలన సాధ్యం అవుతుందని నియోజికవర్గ టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ అన్నారు. ఆదివారం నాడు పార్టీ కార్యాలయం లో మాట్లాడుతూ రాజమండ్రిలో జరిగిన చారిత్రక మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో విడుదల చేసిన మినీ మేనిఫెస్టో ప్రజల్లో చాలా ధైర్యాన్ని నింపిందన్నారు. సంక్షేమ పథకాలు అన్నా, సంక్షేమ ప్రభుత్వం అన్నా గుర్తొచ్చేది టిడిపి అని మరోసారి నిరూపించిందన్నారు. చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రధాన అంశాలైన మహాశక్తి, తల్లికి వందనం, బి.సిలకు రక్షణ చట్టం, ఇంటింటికి తాగునీరు, అన్నదాత, ఆర్టీసీ బస్సుల్లో జిల్లాల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం, పూర్ టు రిచ్ తదితర కార్యక్రమాలతో టిడిపి 2024లో విజయం సాధించడం ఖాయమని, టిడిపి యువ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ శ్రీకాకుళం పార్లమెంట్ అధ్యక్షులు పూన సంతోష్ కుమార్, పట్టణ 17వ వార్డు ఇన్చార్జి జన్నెల సంతోష్ కుమార్, పట్టణ ఐటీడీపీ అధ్యక్షుడు సాలిన జగదీష్, ఇచ్ఛాపురం నియోజకవర్గం టీపీడబ్ల్యు కీలక సభ్యుడు పైల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే...

ప్రజాశక్తి-పలాస

రాష్ట్రం అభివద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని శ్రీశయన సాధికారిక సమితి అధ్యక్షులు రత్నాల వెంకటేష్‌బాబు, సభ్యులు బి.సూర్య కష్ణంరాజు, బూరెల జగ్గారావు మాస్టారు అన్నారు. మండలంలోని కిష్టుపురంలో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభు త్వం రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసిందని, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. కార్య క్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.